ప్రజాశక్తి
గురువారం 2 అక్టోబరు 2025
5
అల్లూరి సీతారామరాజు

ఘనంగా అంతర్జాతీయ కాఫీ దినోత్సవం

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని కాఫీ బోర్డు అధికారులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా అంతర్జాతీయ కాఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాఫీ బోర్డు మెంబర్ తాంగుల విశ్వనాథం మాట్లాడుతూ, కాఫీ రైతులకు అండగా ఉంటామని తెలిపారు. జూనియర్ లైజన్ ఆఫీసర్ వివికెయం లక్ష్మీ మాట్లాడుతూ, కాఫీ రైతులకు కాఫీ బోర్డు తరుపున అన్ని విధాలుగా అందుబాటులో ఉంటామని, ఇండియా కాఫీ యాప్ గురించి చెప్తూ అందరూ ఈ యాప్‌లో కాఫీ రైతులు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్స్టెన్షన్ అధికారి జి రవి కుమార్, నేచర్ బయో ఫుడ్ సంస్థ మేనేజర్ దావత్,కొమ్మన శ్రీనివాస్‌రావు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాఫీ బోర్డు మెంబర్

స్వల్పంగా తగ్గిన గోదావరి

గోదావరి వరద భద్రాచలం వద్ద స్వల్పంగా తగ్గింది. బుధవారం ఉదయం 11 గంటలకు 47 అడుగుల వద్ద ఉన్న వరద పోటు సాయంత్రం 4 గంటలకు 45.5 అడుగులకు తగ్గింది. అయినా ముంపు వాసుల్లో భయం వీడలేదు. చాలా గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. రాకపోకలు నిలిచిపోయాయి. పంటలు అయితే అసలు ఎక్కడున్నాయో కూడా ఆనవాలు పట్టలేని పరిస్థితిలో ఉన్నాయి. ఏది పొలమో, ఏది చెరువో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. నిర్వాసితులు మౌలిక వసతులు లేని పునరావాస కాలనీల్లో ఉండలేక, కిందకి రాలేక అవస్థలు పడుతున్నారు. తమను ఆదుకోవాలని నిర్వాసితులు, రైతులు కోరుతున్నారు.

- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- వందల ఎకరాల్లో పంటలు నీటిపాలు
- ముంపు పొలాలను పరిశీలించిన సిపిఎం నాయకులు

మొద్దులగూడెంలో నీటమునిగిన పొలాలు

శ్రీరామగిరిలో నీట మునిగిన ఇళ్లు

ప్రజాశక్తి- ఎటపాక : ఉగ్రరూపం దాల్చిన గోదావరి బుధవారం నుండి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద మంగళవారం రాత్రి 50 అడుగులకు చేరుకున్న గోదావరి వరద తగ్గుముఖం పడుతూ బుధవారం సాయంత్రానికి 45 అడుగులకు చేరుకుంది. మురుమూరు, వీరాయిగూడెం, గట్టుగూడెం గ్రామాల రహదారులపై వరద నీరు తగ్గక పోవడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మురుమురు వద్ద రహదారిపై వరద నీరు ఉండటంతో భద్రాచలం - రేఖపల్లి మధ్య రెండు రోజులుగా ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. వందల ఎకరాల్లో మిర్చి తోటలు నీట మునిగాయి.

విఆర్‌పురం: భద్రాచలం వద్ద స్వల్పంగా గోదావరి తగ్గినా మండలంలో మాత్రం ఇంకా వరదపోటు తగ్గలేదు. శ్రీరామగిరి, సీతంపేట, వడ్డిగూడెం, ఇప్పూరు, రామవరం, అడివి వెంకన్నగూడెం, తుష్టివారిగూడెం, కన్నాయి గూడెంనకు రాకపోకలు నిలిచిపోయాయి. వీటితో పాటు రాజుపేట, చింతరే వుపల్లి, గుండుగూడెం సున్నంవారిగూడెం, రామవరం, చొప్పల్లి, తుష్టివారి గూడెంలో పంటలు నీట మునిగాయి. శ్రీరామగిరి, చొక్కనపల్లెలో వరి మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ప్రభుత్వం సహాయం అందడం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలను సందర్శించలేదని ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముంపు పొలాల పరిశీలన

మండలంలోని రామవరం పంచాయతీ సోములగూడెంలో బుధవారం ముంపునకు గురైన వరి పొలాలను ఎంపిపి కారం లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరుస వరదలతో రైతాంగం ఎన్నో కష్టాలను ఎన్నో కష్టాలను ఎదుర్కొం టున్నారని అప్పుల చేసి మరీ సాగు చేసినా అంతా నీటిపాలయ్యిందన్నారు. తక్షణమే ముంపు ప్రాంతాలను పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని ఎకరానికి పదివేల నుండి 15 వేల వరకు ఖర్చయిందని రైతులకు తక్షణమే రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, గొర్రెరాజు, ఆసు లక్ష్మయ్య సుధీర్ పాల్గొన్నారు.

విఆర్‌పురం: మండలంలో పొలాలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

6 ఎకరాల్లో మిర్చి పైరు నీట మునిగింది

నేను ఆరు ఎకరాల్లో మిర్చి తోట వేశాను. గోదావరి వరదలకు పంట పూర్తిగా నీట మునిగింది. భూములు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఇప్పటికే లక్ష రూపాయలు ఖర్చు చేశా. మొత్తం వరద పాలైంది. మరొక దఫా మిర్చి వేయాలంటే మరొక లక్ష అవుతుంది. మళ్లీ వేసినా చేతికి వస్తుందన్న గ్యారంటీ లేదు. మూడు సంవత్సరాలుగా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- యాలం సంతోష్, రైతు

ఏ అధికారీ రాలేదు..

మా గ్రామం వరదలకు మునిగి ఐదు రోజులు కావస్తున్నా ఇంతవరకరూ ఏ అధికారి కూడా రాలేదు. తాడువాయిలో పునరావాస కాలనీలో ఇళ్లు ఇచ్చారు. కానీ ఇంకా పూర్తికాలేదు. వసతులు ఏమీలేవు. వసతులు పూర్తి స్థాయిలో కల్పిస్తే ఇక్కడ నుంచి వెళ్తాం.

- కాంతారావు, రాజు, శ్రీరామగిరి

నష్టపరిహారం చెల్లించాలి

ఎంతో ఖర్చు పెట్టి వరి నాట్లు వేశాం. ఎరువులు, పురుగు మందులు వాడాం. వరద వచ్చి ఐదు రోజులు అవుతోంది. వరద తగ్గినా సరే వరి పైరు ఉండదు. తక్షణమే అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలి.

- మడకం కన్నారావు, మొద్దులగూడెం

వంతెన లేక అవస్థలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని అత్యంత మారుమూల ప్రాంతమైన బుంగాపుట్టు గ్రామపంచాయతీ పరిధిలో కొజ్జరిగూడ గ్రామంలో బీటి రోడ్డు నిర్మించి, మార్గమధ్యంలోని వాగులో వంతెన నిర్మాణం చేపట్టాలని కొర్ర లోకినాద్, డి డుంబ్రు, పాంగి సీతారాం, కొర్ర గణేష్ , కొర్ర నాగేష్ కోరారు. ద్విచక్ర వాహనాన్ని కావడి భుజాలపై మోసి వాగులో అవతలి ఒడ్డుకు చేరుతూ వినూత్నంగా నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం కొర్ర గణేష్ మాట్లాడుతూ, మండలంలోని ఏఓబి సరిహద్దు ప్రాంతమైన చివరి పంచాయితీ లో అనేక గ్రామాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామం లోని గర్భిణీ, బాలింతలను ఆసుపత్రికి తరలించాలన్న, అత్యవసర వైద్య సేవ నిమిత్తం రోగులను తరలించాలన్న ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో డోలీలతో తరలించాల్సి వస్తుందన్నారు. కనీసం రోడ్డు సౌకర్యం నేటికీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 32 కుటుంబాలు కలిగి నివసిస్తున్నప్పటికీ నేటికీ ప్రభుత్వ అధికారులు కనీసం స్పందించకపోవడం విచాం కరమన్నారు. గ్రామంలో బీటి రోడ్డు నిర్మాణాలు చేపట్టి, కల్వర్టు నిర్మాణాలు పూర్తి చేసి రాకపోకలకు సౌకర్య వంతంగా కొజ్జరిగూడ గ్రామంలో రోడ్డు నిర్మాణం తో పాటు కల్వర్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

బైక్‌ను మోసుకొస్తున్న గిరిజనులు

మెడికల్ స్టోర్‌ఉన ప్రారంభిస్తున్న ఎంపీ

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి

-ఎంపీ తనుజారాణి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: చదువుకున్న గిరిజన నిరుద్యోగ యువత స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని అరకు పార్లమెంట్ ఎంపీ జి తనుజరాణి చెప్పారు. స్థానిక మండల కేంద్రంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన క్లినికల్ అండ్ మెడికల్ జనరల్ స్టోర్ ను ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనులకు మెడికల్ పరంగా అందుబాటులో ఉండే విధంగా గిరిజన నిరుద్యోగ యువత ఇటువంటి క్లినికల్ జనరల్ స్టోర్‌ను ఏర్పాటు చేసుకోవడం ఆనందదాయకం అన్నారు. ఇటువంటి సేవలను గిరిజనులకు విస్తారంగా ఉపయోగించి మరింత మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఎం శ్రీరాములు, మాజీ వైసీపీ మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్ పాల్గొన్నారు.

దేవీ నిమజ్జనంలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-విఆర్‌పురం: దేవీనవరాత్రుల అనంతరం నిమజ్జనోత్సవం లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు. కూనవరం, విఆర్‌పురం మండలంలో వరదల దృష్ట్యా సాయంత్రం 6లోపు నిమజ్జనం పూర్తి చేయాలన్నారు.

నేడు మాంసం దుకాణాలు బంద్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గాంధీజయంతి సందర్భంగా గురువారం రాజవొమ్మంగిలో మాంసం దుకాణాలు, మద్యం దుకాణాలు బంద్ చేయాలని పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పమన్నారు.

3న పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని కిర్రాబు పంచాయతీ కార్యాలయానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఈ నెల 3 వ తేదీన భూమిపూజ చేయనున్నట్లు ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిఅధికారులు, సచివాలయం సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో బుధవారం 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న స్విచ్ యార్డ్‌లో బుధవారం ఉదయం ఏడు గంటలకు పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో విద్యుత్ సరఫరాకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకు, పోస్టాఫీస్‌లో లావాదేవీలు నిలిచిపోయాయి. విద్యుత్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రక్తదానం చేస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - చింతూరు: 42వ సెంట్రల్ రిజర్వ్‌పోలీస్‌ఫోర్స్ బెటాలియన్ ఎస్ఎన్ఎస్‌టిఎ కార్యక్రమం కింద చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్)లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సిహెచ్‌సి చింతూరు వైద్య సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ అధికారుల సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కోటిరెడ్డి సూపరింటెండెంట్ డాక్టర్ స్పందన వైద్యఅధికారులు సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని అభినందించారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని సీతారామరాజు కాలనీలో బెతేస్తా ప్రార్థనా మందిరంలో బుధవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ నిస్సికుమార్ సుమారు 20 మంది రక్తదానం చేశారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తసేకరణ చేశారు.

అడ్డతీగల: రక్తదానం చేయాలని నినాదాలు చేస్తున్న సిబ్బంది

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జిఓలు రద్దు చేయాలి

ప్రజాశక్తి అరకులోయ రూరల్:హైడ్రో ప్రాజెక్ట్ జిఓలు రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం గుజ్జెలి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పరిధిలో నవయుగ కంపెనీ ఎగువ డ్యామ్ నిర్మాణం కోసం, అరకువేలి మండలం ఇరగాయ పంచాయితీ, మొర్రిగూడ గ్రామంలో పాతిన నవయుగ కంపెనీ పాతిన సిమెంట్ దిమ్మలను బుధవారం ఆదివాసి గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసులు ధ్వంసం చేశారు.అనంతరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కొర్రా స్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర కూటమి ప్రభుత్వం జి ఓ 13 విడుదల చేసిందని, బడా నవయుగ ఎలక్ట్రిసిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 2500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం అప్పగించింద న్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం అరకువేలి మండలం లోతేరు, ఇరగాయి పంచాయతీ పరిధిలో ఎగువ డ్యామ్ నిర్మాణం కోసం దూద్ కొండి, కాగువలస మర్రిగూడ మన్యం పార్వతిపురం జిల్లా పాచిపెంట మండలం సతాబి గ్రామంలో నాలుగు దిమ్మలు పాతారన్నారు. గిరిజన హక్కులు, చట్టాలు ఉల్లంఘించి కేంద్ర బిజెపి, రాష్ట్ర కూటమి ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇస్తూ జిఓలు 13, 51లను రాష్ట్ర కేబినెట్లో ఆమోదిచడం జరిగిందని, దీన్ని గిరిజనులు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.గుజ్జెలి హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే అనంతగిరి మండలం గుమ్మకోట, గరుగుబిల్లి, భీంపోలు పంచాయతీలు, అరకువేలి మండలం లోతేరు, ఇరగాయి పంచాయతీలు, మన్యం పార్వతీపురం జిల్లా పాచిపెంట మండలంలో తంగలం, శతాభి, గర్శిగుడ్డి, మూటకూడు, గొత్తూరు పంచాయతీలు మొత్తం 10 పంచాయతీల పరిధిలో ఆదివాసులు తమ ఆడవి, జిరాయితి భూమి, అటవీ భూమి, కాఫీ, మిరియాలు, తోటలు సీతాఫలాలు తోటలు, జల సమాధి అవుతాయని తెలిపారు. ఆదివాసులు నిరాశ్రయులు అవుతారన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా ప్రైవేట్ కంపెనీతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి జారీ చేసిన జిఓ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇరగాయి పంచాయతీ సర్పంచ్ మాదల నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి మోహన్ రావు, సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామరావు, పిసా కమిటీ నాయకులు బురిడీ నరసింగరావు, బురిడీ విజయ్, బురిడీ నాగేశ్వరరావు, బురిడీ రాజ్ కుమార్, సన్యాసిరావు, స్వామి, అప్పలనాయుడు, స్వామి, సత్యారావు, రాజ్ కుమార్, రామచంద్ర, రాజేష్, సుబ్బారావు, ప్రసాద్, గెన్ను, ప్రసాద్ పాల్గొన్నారు.

విల్లులను ఎక్కుపెడుతున్న నాయకులు

నేటి నుండి గ్రామసభలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 2వ తేదీ గురువారం మహాత్మాగాంధీ జయంతి రోజున దసరా పండుగ సందర్భంగా గ్రామసభలు నిర్వహించడానికి అధికారులందరూ సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. కర్మయోగి అభియాన్ అనే పథకాన్ని గ్రామసభలు ద్వారా ముందుకు తీసుకువెళ్ళి గిరిజన ప్రజానీకానికి శిక్షణ ఇచ్చి వారి నాయకత్వ సామర్థ్యాలను పెంపోందించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలును మెరుగుపరచడానికి, వాటి ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడానికి గ్రామసభలను ఉపయోగించుకోవాలని గనులు భూ గర్భ శాఖ, పరిశ్రమలు, పౌర సర్ఫరా, ఎపి ఇపిడిసి ఎల్, సివిల్ సప్లై కార్పొరేషన్, గృహనిర్మాణ శాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా నేటికీ చేపడుతున్న పనులపై ఆరా తీశారు. జిల్లా సమగ్ర అబివృద్ధికి పివోలు అందరూ ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా చేపట్టిన పనులు ప్రగతిని అధికారులందరూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి వారములో శుక్రవారము అధికారులందరూ ఒక గ్రామంలో హౌసింగ్ మేళా పెట్టి ఇళ్ళు పూర్తి చేయడానికి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఖనిజాల లభ్యత సమాచారం మండలాల వారిగా అందుబాటులో ఉంచి, శాఖా పరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. జిల్లాలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఔత్సాహికులైన వారిని గుర్తుంచి వారికి డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రోమోషన్ కమిటీ ద్వారా సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రైమరీ అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా రైతులకు రుణాలు, జిల్లాలో విద్యుత్ సరఫరా నిరంతరంగా అందించి సమస్యలు అధిగమించాలన్నారు. పిఎం సూర్య ఘర్ స్కీమ్ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఐటిడిఎ పివో తిరుమణి శ్రీ పూజ , రంపచోడవరం పివో బచ్చు స్మరన్ రాజ్, చింతూరు పివో అపూర్వ భరత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'ని సమర్థవంతంగా అమలు చేయాలి

-డిపో మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకంను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు కృషి చేయాలని పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాసరావు సూచించారు. ఈ పథకం అమలుకు కృషి చేస్తున్న పాడేరు డిపో లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలలో "స్త్రీ శక్తి" పథకం అత్యధిక తృప్తిని ఇచ్చిందని సీఎం తెలియ చేశారని ఆర్టీసీ పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేసారని తెలిపారు, అందుకుగాను "ఆర్టీసీలో పనిచేయుచున్న ప్రతి ఒక్క ఉద్యోగికి తన అభినందనలు తెలియజేయమన్నట్లుగా" గేట్ మీటింగ్ ద్వారా డిఎం సిబ్బందికి వివరించారు. అదే విధంగా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించవలెనని ప్రమాదాలు లేకుండా బస్ లు నడపాలని, వీటిలో పట్ల బాధ్యతరాహిత్యం వహించరాదన్నారు. స్త్రీ శక్తి టిక్కెట్లు ఇచ్చే యు టి ఎస్ టిమ్ లలో తగు మార్పులు చేయడం జరిగిందని, కేసులు ఎట్టి పరిస్థితుల్లో లేకుండా చూసుకోవాలని సూచించారు. మనము ప్రభుత్వ సేవకులమనీ గుర్తేరగాలని డి ఎం కార్మికులకు పలు సూచనలు చేశారు.

డ్రైవర్ కు సత్కారం

పాడేరు డిపోలో 38 సంవత్సరాలు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కోళ్ల నర్సింగరావు కు బుధవారం డిపో ఆవరణలో కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పి శ్రీనివాసరావు చేతుల మీదుగా నర్సింగ్‌రావు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నరసింహారావు పాడేరు డిపోలో సుదీర్ఘకాలం పనిచేసి అందించిన సేవలను డిపో మేనేజర్ తో పాటు పలువురు కార్మికులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు సహచర డ్రైవర్లు కండక్టర్లు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న డిపో మేనేజర్

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తత

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-హుకుంపేట: హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి . టి.విశ్వేశ్వర రావు నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులను స్వయంగా పరీక్షించి చికిత్సలు అందించారు. గర్భిణులకు సుఖ కాన్పులు, రోగులకు సమయపాలనతో వైద్యం అందించాలంటూ వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సిబ్బంది సమ్మెల కారణంగా చికిత్సల్లో అంతరాయం కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.ఆసుపత్రి వార్డులు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ములియాపుట్టు గ్రామ సచివాలయంలో నిర్వహించిన స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యుటేషన్ వైద్యాధికారి ఎస్.శ్రావణ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుల్లేలి సింహాద్రి, యం.సంజీవ పాత్రుడు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిఎస్‌టి సంస్కరణలతో ఉపశమనం

మాట్లాడుతున్న సహాయ కలెక్టర్ సాహిత్

ప్రజాశక్తి-పాడేరు: జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఉపశమనం లభించిందని సహాయ కలెక్టర్ కే. సాహిత్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జిఎస్టి అవగాహనా కార్యక్రమలో. సహాయ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సహాయ కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగానకు మేలు చేసేలా ప్రవేశపెట్టిన జీఎస్టీ - 2 పన్ను తగ్గింపు పై రైతులకు అవగాహన కల్పించాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన "సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్ " కార్యక్రమంలో భాగంగా జిఎస్టి రేటు మార్పులపై జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కె.సాహిత్, జిల్లా నోడల్ అధికారి వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ రమేష్, జిఎస్టి ఆఫీసర్ గత్తుం శేషగిరి నాయడు, జిఎస్టి ఆఫీసర్ రజినికాంత్, జిఎస్టి ఆఫీసర్ ఎస్వీ ప్రసాద్‌లు ప్రచారం నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నందా, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ నవరాత్రులు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో దేవీ నవరాత్రుల మహోత్సవాలను అతి వైభవంగా నిర్వహించారు. ఈనెల 2న విజయదశమి కావడంతో బుధవారం పట్టణంలో దసరా సందడి నెలకొంది. మార్కెట్ ప్రాంగణాలు జనాలతో కిటకిటలాడాయి. పాడేరులో దసరా ఉత్సవాలపై వరుణుడి ప్రభావం పడింది. గత ఐదు రోజుల నుంచి మధ్యాహ్నం పూట సాయంత్రం వేళ ఒక మోస్తారు వర్షం కురవడంతో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో భవానీ భక్తులకు ఆటంకం కలిగింది . పట్టణంలోని మెయిన్ రోడ్ ప్రాంగణంలో దుర్గామాతను ప్రతిష్టించి ఐదు రోజులు ఉత్సవాలు నిర్వహించారు. అలాగే ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి ఆలయం మరియు దుర్గాదేవి ఆలయాల్లో దేవీ నవరాత్రుల మహోత్సవాలను తొమ్మిది రోజులు పాటు ప్రత్యేకంగా నవదుర్గల అలంకరణలలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో తొమ్మిది రోజులపాటు దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎఎస్‌పి

చింతపల్లి : దసరా నవరాత్రి వేడుకల సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని రంగా సెంటర్ వద్ద ప్రతిష్టించిన కనకదుర్గమ్మ తల్లిని చింతపల్లి సబ్ డివిజన్ ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా బుధవారం దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, స్థానిక ప్రముఖులు, పోలీసులుపాల్గొన్నారు.

రీసర్వే, మ్యుటేషన్లు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: రీ సర్వే, భూములు మ్యుటేషన్లు, ఆర్అండ్ఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, మంజూరైనా గృహాలు త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. అన్నదాత సుఖీభవ, రీ సర్వే, గృహ నిర్మాణ, ఎపి సేవ పోర్టల్, క్యాస్ట్ సుమోటో డ్రైవ్ పై సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా నేటికీ చేపడుతున్న పనులపై ఆరాతీశారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ సర్వే ఫేజ్ 1, ఫేజ్ 2, రీ సర్వే మ్యుటేషన్లు, అర్అండ్ఆర్ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వీఆర్వో లాగిన్లో పెండింగ్ లో ఉన్న తహసిల్దార్ లాగిన్లో పెండింగ్‌లో ఉన్న సర్వే సమస్యలను పరిష్కరించాలన్నారు. వాటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్లకు సూచించారు. జీవో 30, 23లలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేశారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షా సమావేశం లో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ , రంపచోడవరం పివో బచ్చు స్మరన్ రాజ్, చింతూరు పివో అపూర్వ భరత్, సబ్ కలెక్టర్ రంప చోడవరం శుభం నోఖ్వాల్, అసిస్టెంట్ కలెక్టర్ చిరంజీవి వెంకట సాహిత్, జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు .

మాట్లాడుతున్న కలెక్టర్

పింఛన్లు అందజేసిన కలెక్టర్

పాడేరు: పాడేరు మండలం కందమామిడి గ్రామంలో బుధవారం ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు.గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు కలెక్టర్ పింఛన్లు అందించారు. ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లాలో 1,22,507 మందికి రూ.51.64 కోట్లు ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి, జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి.మురళీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రజా మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి గ్రామపంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో మినీ బస్సు షెల్టర్ పక్కన ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం ఐదేళ్ల క్రితం చేపట్టారని, కాన ఇప్పటికీ వినియోగానికి తేలేదని పేర్కొన్నారు. నీటి సరఫరా కోసం కరెంటు మోటార్ ఏర్పాటు చేయకపోవడం, పురుషుల మరుగుదొడ్లకు తలుపులు అమర్చకపోవడం వలన మరుగుదొడ్లు వాడుకునే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు.

మండల కేంద్రంతో పాటు ఈ ప్రాంతాన్ని ముఖ్యమైన కేంద్రం కావడంతో నిత్యావసర సరుకుల కోసం, విద్య, వైద్య సేవల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, తాజంగి, లమ్మసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు కూడా చింతపల్లి వస్తారని తెలిపారు. మరుగుదొడ్లు లేక వీరంతా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చింతపల్లి ప్రజా మరుగుదొడ్లను వినియోగంలోకి తేవడంతో పాటు తాజంగి, లమ్మసింగి, రాజుపాకల, లోతుగడ్డ జంక్షన్, అన్నవరం, చింతపల్లి మార్కెట్ ఏరియా, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో ప్రభుత్వ నిధులతో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చిరంజీవి డిమాండ్ చేశారు. చింతపల్లి ప్రజా మరుగుదొడ్లను నిర్లక్ష్యంగా వదిలేసిన కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

7న ధర్నా జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 7న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కోటాని శ్రీనివాస్ వెల్లడించారు అల్లూరి జిల్లా పాడేరు ఆదివాసీ ఉద్యోగ భవనం లో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు విజయవాడ లో చేయ తలపెట్టి ధర్నా కార్యక్రమంలో బాగంగా సన్నాహక సమావేశంను జిల్లా ఫ్యాప్టో ఛైర్పర్సన్ రావుల జగన్ మోహన రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మహా ధర్నా కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పెండింగ్ లో ఉన్న 4 డిఎలను వెంటనే ప్రకటించాలని, 12వ పిఆర్సి కమిటీ ఏర్పాటు చేసి 30శాతం తగ్గకుండా ఐ ఆర్ భతి) ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ రావుల జగన్ మోహన రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుండి విముక్తి కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఉపాధ్యక్షులు వల్ల.వెంకటరమణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ మహేష్,. శేషగిరి, గిడ్డి, వరలక్ష్మీ, కొర్ర. ధనుర్జాయ్ పాల్గొన్నారు

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య దసరా ప్రత్యేక రైలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : దసరా సందర్భంగా ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి, తూర్పు కోస్ట్ రైల్వే విశాఖపట్నం నుండి చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రైలు నెంబర్ 08589 విశాఖపట్నం - చర్లపల్లి స్పెషల్ రైలు ఈ నెల 3వ తేదీ రాత్రి 7.30 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 08590 చర్లపల్లి-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 4వ తేదీ రాత్రి 20.00 గంటలకు చర్లపల్లి నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, అనపర్తి, రాజమండ్రి, నిడదవోలు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి పాగిలాల, నడికుడిపల్లి మీదుగా ప్రయాణిస్తుంది.రైల్వేప్రయాణికులు ప్రత్యేక రైలు సేవలను వినియోగించుకోవాలని రైల్వే శాఖ అధికారులు కోరారు.

పిడుగుపాటుకు విద్యార్థిని మృతి

కీర్తి మృతదేహం

ప్రజాశక్తి -అనంతగిరి: ఉరుములతో కూడిన భారీ వర్షం పిడుగుపాటుకు సెల్ పోన్ మాట్లాడుతూ విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దబిడ్డ పంచాయతీ పరిధి చెరకుమడతలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బడ్నాయిన. కీర్తి (16) మంగళవారం సాయంత్రం ఇంటిలో సెల్ ఫోన్ మాట్లాడుతుంది. ఒక్కసారిగా గ్రామానికి సమీపం అటవీ ప్రాంతంలో పిడుగు పడటంతో ఇంటిలోనే కుప్పకూలి మృతి చెందింది. 108 అంబులెన్స్ సిబ్బంది పరీక్షలు నిర్వహించిన అనంతరం మృతి చెందినట్లు తెలిపారు.

పిడుగుపాటుకు మూగజీవాలు మృతి

పెదబయలు : మండలంలో లక్ష్మిపేట పంచాయతీ పరిధి కోడువలస గ్రామంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు కారణంగా పిడుగులు పడటంతో గ్రామంలో సుమారు 26 పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఉదయం ఎండ కాయటంతో సమీపంలోని అటవీ ప్రాంతానికి పశువులను మెత్తకు తోలుకెళ్లారు. మధ్యాహ్నం హఠాత్తుగా ఉరుములతో కూడిన వర్షంతో పిడుగులు పశువుల పై పడటంతో 20 పశువులు మృతి చెందాయి. కొర్ర బంగారయ్యకు చెందిన 2 ఆవులు, కిల్లో బాలరాజు -2, కిల్లో శ్రీనుబాబు-2, కిల్లో మల్లేష్ -2, కిల్లో సత్యారావు-2, వంతల రామ్‌ప్రసాద్ -2, వంతల రాజరావు-2, వంతల రాజుబాబు -2, కిల్లో వెంకటరావు -2, కిల్లో బంగారన్న -2, కిల్లో సూరిబాబు -2, కిల్లో వెంకటరావు -2, కిల్లో సూరిబాబు 2 ఆవులు పిడుగు పాటు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి కోడువలస గ్రామానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ప్రభుత్వం నుండి నష్ట పరిహారం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని బాధితులు కోరారు.

13 మేకలు మృతి

చింతపల్లి : మండలంలో కురిసిన భారీ వర్షం పిడుగుల కారణంగా తాజంగి పంచాయతీ పరిధి టీకరవీధికి చెందిన రైతు తాడిపూడి లక్ష్మణరావుకు చెందిన 13 మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనతో ఆ రైతుకు సుమారు రూ.1.80 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. మేకలను తన కష్టార్జిత ధనంతో పెంచుకున్నానని, ఒక్కసారిగా పిడుగు బారి పడి అవన్నీ ప్రాణాలు కోల్పోవడం వల్ల కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని లక్ష్మణరావు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతుకు కలిగిన నష్టాన్ని ప్రభుత్వం తక్షణమే పూడ్చిపెట్టాలని, విపత్తు సహాయక నిధుల ద్వారా ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

హోమ్ స్టేలో పిఒ బస

విన్నతులను స్వీకరిస్తున్న పిఒ

ప్రజాశక్తి- అనంతగిరి: పర్యాటకులకు గిరిజన ప్రాంతంలో హోమ్ స్టేలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి శ్రీ పూజ అన్నారు. మండలం లోని మారుమూల లుంగపర్తి పంచాయతీ పరిధి మెట్టవలస గ్రామంలో మంగళవారం సాయంత్రం కుటుంబ సమేతంగా ఆమె సందర్శించారు. అనంతరం ప్రవహం హోమ్ స్టే నిర్వహకుడు రాజుతో అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెట్టవలస గ్రామంలో గోస్తని గడ్డకు ఆనుకొని కొత్తగా ఏర్పాటు చేసిన హోమ్ స్టే మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

సమస్యలపై సిపిఎం వినతి..

మెట్టవలస గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను సిపిఎం నాయకులు భీమన లిఖిత పూర్వకంగా పిఒకు విన్నవించారు. సిసి రోడ్డు, రచ్చబండ, డ్రైనేజీ, తాగునీటి సమస్య, మెట్టవలస మీదుగా ఓనుకుండా వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. వెలగల పాడు గ్రామానికి విద్యుత్ స్తంభాలు, వంతెనగరువుకు చెక్ డ్యామ్. తదితర సమస్యలపై విన్నవించారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి- మారేడుమిల్లి: సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శిరీషదేవి అన్నారు. బుధవారం ఆమె ఫింఛన్లు పంపిణీ కార్యక్రమం నియోజక వర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్ సౌజన్యంలో నిర్వహించారు. మండలంలోని దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల్లో పింఛన్లు అందించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇబ్బందులు ఉంటే తెలపాలన్నారు. మౌలిక వసతులకు వినతులు రాగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబూ రమేష్, జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్లా రాజశేఖర్ రెడ్డి మండలపార్టీ అధ్యక్షులు గురుకుశేష్‌కుమార్, జనసేన మండల అధ్యక్షులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

4న ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ధర్నా

ప్రజాశక్తి- రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐటిడిఎ రంపచోడవరం పరిధిలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం నిమిత్తం అక్టోబర్ 4వ తేదీన ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు అల్లూరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.మహేశ్వ రరావు, కె.కృష్ణ తెలిపారు. అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పదోన్నతుల ఆర్డర్స్ వెంటనే ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అంతా హాజరు కావాలని యుటిఎఫ్ ఐటిడిఎ సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి కో-కన్వీనర్ సనాతనాబాబు పిలుపునిచ్చారు.

కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న విఒఎలు

సమస్యల పరిష్కారానికి విఒఎల ఆందోళన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ విఒఎలు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం ఆందోళన చేపట్టారు. సంఘం నాయకులు చిన్న తల్లి, ఈసర్లమ్మ తదితరులు మాట్లాడుతూ వెలుగు యానిమేటర్ల మూడేళ్ల కాల పరిమితి జిఒ రద్దు చేయాలని,పాడైన పాత ఫోన్ల స్థానంలో 5జి ఫోన్లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వెలుగు కార్యాలయ సిబ్బందికి అందజేశారు. పలువురు విఒఎలు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి-కూనవరం: శబరి పరీవాహక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అన్నారు. బుధవారం సిపిఎం మండల కమిటీ అత్యవసర సమావేశం కూటూరులో మడకం నాగమణి అధ్యక్షతన జరిగింది. పెంటయ్య మాట్లాడుతూ శబరిబెల్లు గ్రామస్తులు ప్రతి సంవత్సరం వరదల వల్ల విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే భీమవరం సబ్‌స్టేషన్ నుండి ఆర్అండ్‌బి రోడ్డు మీదుగా బురదగూడెం వరకు విద్యుత్‌లైనుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండల కార్యదర్శి బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు

ర్యాలీ నిర్వహిస్తున్న భవననిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి- రంపచోడవరం : భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, కాకినాడ ఉమ్మడి జిల్లా భవననిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో పుట్ట రామరాజు అధ్యక్షతన రంపచోడవరం స్థానిక యుటి ఎఫ్ భవనంలో భవన నిర్మాణ కార్మికుల జిల్లా మొదటి మహాసభ బుధవారం నిర్వహించారు. స్థానిక యుటిఎఫ్ భవనం నుండి అంబేద్కర్ సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను నిలుపుదల చేసిందని, అప్పటి నుంచి మృతి చెందిన కార్మికుల కుటుం బాలకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సహకారం అందలేదన్నారు. 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సంక్షేమబోర్డు పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పినా అమలుకాలేదన్నారు. సంక్షేమబోర్డు పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. భవననిర్మాణ కార్మికులు పొదుపు చేసుకున్న రూ.3వేల కోట్లు భవనిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉందని కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ అసెంబ్లీలో పేర్కొన్నారని ఆదుకునే నాథుడే కనబడడం లేదని విమర్శించారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ వద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రంపచోడవరం కేంద్రంగా లేబర్‌ఆఫీస్ ఏర్పాటు చేయాలని, ఇంటి లోన్లు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు భవిష్యత్తు సంసిద్ధ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ

నూతన కమిటి ఎన్నిక

నూతన కార్యదర్శిగా పి.రామరాజు, అధ్యక్షులుగా తోట శ్రీనివాసులు, ట్రెజరర్‌గా గుల్లల సురేష్, గౌరవ అధ్యక్షులుగా పల్లపు వెంకట్ ఉపాధ్యక్షులుగా ఎస్ వీరబాబు, విజయభాస్కర్, చిన్నారెడ్డి, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఆదినారాయణ, తెడ్ల రాంబాబు, శ్రీను, పుల్లారావు మొత్తం 27 మందితో జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బత్తిన నిర్మల, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాధల, విద్యాసాగర్, గిరిజన సంఘం మండల కార్యదర్శి తీగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాల అమలులో విఫలం

బొడ్డు చందర్రావుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను

ప్రజాశక్తి- ఎటపాక: ఆదివాసీ చట్టాలు అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కుసుమనపల్లి లో సర్పంచ్ మోసం రాజులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటపాక మండలం నందిగామ గ్రామానికి చెందిన బొడ్డు చందర్రావు అనే వ్యక్తి గిరిజనేతరుడు ఆయన ఏజెన్సీలో వేలాది ఎకరాలు ఆదివాసీ భూముల్లో చట్టాలను తుంగలోకి తొక్కి అమాయక ఆదివాసీలను మోసం చేస్తూ తక్కువ రేట్లకే జామాయిల్ సాగు చేస్తున్నారని, పంట తీసిన తర్వాత ఆదివాసీలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. సర్పంచ్‌పై కూడా ఎటపాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి బెదిరింపులకు గురి చేశారన్నారు. ఎర్రబోరు, వినాయకపురం, పట్టుచీర, నల్లకుంట, కన్నాపురం, విస్సాపురం, గర్భకుంట, కుసుమనపల్లి గ్రామాల్లో బొడ్డు చందర్రావు జామాయిల్ సాగు చేస్తున్నారన్నారు. ఇలా ఎక్కడెక్కడ గిరిజనేతరులు ఉన్నారో వారిని పట్టుకుని ఆ లాభాలు ఆదివాసులే తీసుకోవాలని పిలుపునిచ్చారు. 1/70 చట్టం ప్రకారం అక్రమ కట్టడాలను తొలగించాలని భూ ఆక్రమణలు నిషేధించాలని ఆదేశాలు ఇస్తున్నా వాటిని అధికారులు తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పండ కామేశ్వరరావు ఆదివాసీలు మోసం కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుంజా శ్రీను

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అదనపు కుర్చీల ఏర్పాటు

ప్రజాశక్తి-చింతపల్లి : పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు చింతపల్లి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ప్రయా ణికుల సౌకర్యార్థం అదనపు కుర్చీలు ఏర్పాటు చేసినట్లు పాడేరు ట్రాఫిక్ సూపర్వైజర్ టి.రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అదనపు కుర్చీలను ఏర్పాటు చేశారు. త్వరలో మరో మూడు కుర్చీలను ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం మరమ్మతులకు గురైన పాత కుర్చీలను బాగు చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రైవేట్ వాహనదారులు కాంప్లెక్స్ ఆవరణలోకి ప్రవేశించకూ డ దని, ద్విచక్రవాహనదారులు తమ వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలోనే నిలపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చింతపల్లి ట్రాఫిక్ గేట్ ఎం.గణేష్, ఆర్టీసీ గ్యారేజ్ పెయింటర్ జె.శేఖర్ పాల్గొన్నారు.

గ్రామాలు ఖాళీ చేసేవరకూ ఆ భూములు ఆదివాసీలవే

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్‌పురం: గిరిజనేతర భూస్వాములకు రక్షణ కల్పిస్తూ సబ్‌కలెక్టర్ సర్క్యులర్ ఇవ్వడం ఆదివాసీ చట్టాలకు విరుద్ధమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులిసంతోష్‌కుమార్ విమర్శించారు. బుధవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఒకపక్క పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితులుగా ఉండి భూమిలేని నిరుపేద ఆదివాసీలు ఆయా భూములు సాగు చేసుకుంటుం టే అధికారులు సర్క్యులర్ జారీచేసి ఆదివాసీలకు అన్యాయం చేయాలని చూడడం సరికాదన్నారు. ఆయా భూములను ఖాళీ చేసే వరకు స్థానిక ఆదివాసీలే సాగు చేసుకుంటారన్నారు. బయట ప్రాంతంలో స్థిరపడ్డ వారి భూములను మాత్రమే ఆదివాసీలు సాగుచేస్తున్నారని ఈ విషయం అధికారులు తెలుసు కోవాలని హితవు పలికారు. కొంతమంది రాజకీయ పబ్బం గడుపుకునేం దుకు ఆదివాసీలు ఆక్రమించుకుంటున్నారని తప్పుడు సమాచారాన్ని ఇస్తే వాస్తవాలు తెలుసుకోకుండా ఎలా సర్క్యులర్లు జారీ చేస్తారని మండిపడ్డారు. ఆ భూములను ఆదివాసీలే సాగు చేస్తారని తెగేసి చెప్పారు.

శేషుకుమార్‌కు అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

టిడిపి మండల అధ్యక్షునిగా శేషుకుమార్

ప్రజాశక్తి -మారేడుమిల్లి: మారేడుమిల్లి టిడిపి మండల అధ్యక్షునిగా రెండోసారి గురుకు శేషుకుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ప్రతిపాదించినట్లు ఎమ్మెల్యే శిరీషదేవి మారేడుమిల్లి మండల పర్యటనలో బుధవారం తెలిపారు. శేషుకుమార్ మాట్లాడుతూ తన నియామకానికి కారకులైన మండల ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు శ్రేయోభిలాషులకు, ఎమ్మెల్యే శిరీషదేవి తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్‌భాస్కర్‌కు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

నిరసన తెలుపుతున్న వైద్యులు

సమస్యల పరిష్కారానికి వైద్యుల నిరసన

ప్రజాశక్తి-ఎటపాక: ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ కేర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించాలని ఎటపాక మండలం నెల్లిపాక ప్రధాన కూడలిలో వైద్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపటి నుండి విజయవాడలో రాష్ట్ర స్థాయి ఆందోళన చేస్తున్నామని తెలిపారు. టైమ్‌బౌండ్ ప్రమోషన్స్ ఇవ్వాలనీ, 2020 బ్యాచ్‌కి నోషనల్ ఇన్‌క్రిమెంట్ కల్పించాలనీ తదితర డిమాండ్లను అంగీకరించే వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.